మేఘా సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి

- దోపిడీ కంపెనీ అని ముద్రేసి ఇప్పుడు ప్రేమెందుకు?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- పోలీస్ వ్యవస్థ అధ్వానంగా మారిందని మండిపాటు

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : సుంకిశాల ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని, మేఘా ఇంజినీరింగ్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ప్రధాన ప్రతిపక్షంగా డిమాండ్ చేస్తున్నట్టు మంగళవారం ఎక్స్‌వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. సుంకిశాల ఘటనకు కారణమైన మేఘా ఇంజినీరింగ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకుండా వారికి రూ.4,350 కోట్ల విలువైన కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను బహుమతిగా ఇవ్వబోతున్నారని తెలిపారు. ఈస్ట్ ఇండియా కంపెనీ అని, తెలంగాణ సంపదను దోపిడీ చేసే కంపెనీ అని నాడు ముద్రవేసిన కంపెనీ పట్ల ఈ దాతృత్వం, ప్రేమ ఎందుకని ప్రశ్నించారు.

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ అధ్వానం

పోలీసుల వేధింపులకు విసిగి వేసారిన నిజామాబాద్‌లోని ఓ స్వీట్ షాపు యజమాని తన షాపు ముందు 'పోలీసుల వేధింపుల కారణంగా షాపు మూసేస్తున్నా' అని భారీ బ్యానర్ కట్టాడని కేటీఆర్ తెలిపారు. ఓ వైపు నిజామాబాద్‌లో చిరు వ్యాపారులను వేధించే పనిలో పోలీసులు నిమగ్నమైతే మరోవైపు వరంగల్‌లో ఏకంగా ఓ ఏసీపీ మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని హల్‌చల్ చేశారని గుర్తుచేశారు. కేక్‌కట్ చేయడమే కాకుండా పటాకులు పేల్చడంతో రోడ్డుపై ఉన్న నలుగురు అమాయకులు గాయపడ్డారని, వారిని ఎంజీఎంకు తరలించారని తెలిపారు. మహబూబాబాద్‌లో మూడు రోజుల క్రితం గూండాల వేధింపులకు 17 ఏండ్ల బాలిక ఆత్మహత్యాయత్నం చేసిందని, మూడు రోజుల పాటు దవాఖానలో ప్రాణాలతో పోరాడిందని, తన సోదరులను మళ్లీ చూడలేనన్న బాధతో మరణానికి కొన్ని గంటల ముందు వారికి రాఖీ కట్టిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ హృదయ విదారక వీడియో ఇప్పుడు వైరల్‌గా మారిందని పేర్కొన్నారు. ఘటన జరిగి నాలుగు రోజులు గడిచినా పోలీసుల చర్యలు శూన్యమని కేటీఆర్ విమర్శించారు.

సచివాలయం పరిసరాల్లో చెత్తను తొలగిస్తం

- చీప్ మినిస్టర్.. నా మాట గుర్తుంచుకో!
- రేవంత్‌రెడ్డి మానసిక అనారోగ్యం నుంచి కోలుకోవాలి: కేటీఆర్ ఫైర్
- రేవంత్‌రెడ్డి రాష్ట్రం పరువు తీస్తున్నడు
- పిల్లల ముందు వికృత మాటలు
- మేధావులూ మీరైనా చెప్పండి : దేశపతి
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై పంజాగుట్ట పీఎస్‌లో బీఆర్ఎస్ ఫిర్యాదు

పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న ముఠాగోపాల్, బాల్కసుమన్, దాసోజు, గెల్లు శ్రీనివాస్

హైదరాబాద్/ సిద్దిపేట, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : 'చీప్ మినిస్టర్.. నా మాట గుర్తుంచుకో.. మేము మళ్లీ అధికారంలోకి వచ్చిన రోజే సచివాలయం పరిసరాల్లో చెత్తా చెదారాన్ని తొలగిస్తాం.. మీలాంటి ఢిల్లీ గులాం తెలంగాణ ఆత్మ గౌరవాన్ని అర్థం చేసుకుంటారని ఆశించలేం' అని ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దెప్పిపొడిచారు. 'బడి పిల్లల ముందు నీచమైన పదజాలాన్ని ఉపయోగించడం మీ నీచమైన ఆలోచనను సూచిస్తున్నది' అంటూ విమర్శించారు. 'మీరు మానసిక అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా' అంటూ ఎద్దేవాచేశారు.

హోదాకు తగినట్టు మాట్లాడు: దేశపతి

రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు వికృతంగా ఉన్నదని, పిల్లల ముందు ఆయన మాట్లాడిన తీరు బాగాలేదని, ముఖ్యమంత్రి హోదాకు తగినట్టు మాట్లాడాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ చనిపోవాలని రేవంత్‌రెడ్డి కోరుకోవడం తప్పు అని, రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు తీస్తున్నాడని మండిపడ్డారు. మేధావులైనా ఆయనకు తెలిసేలా చెప్పాలని కోరారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని అమరజ్యోతి, సెక్రటేరియట్ మధ్యలో ఉన్న ఐలాండ్‌లో కేసీఆర్ విగ్రహం పెడుతామని ఎవరూ అనలేదని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మాత్రమే పెట్టాలని నిర్ణయించామని చెప్పారు. రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతామని సీఎం రేవంత్‌రెడ్డి అంటే మేధావులు, కవులు, కళాకారులు ఒత్తిడి తెచ్చారని, అందుకే ఆయన వెనక్కి తగ్గి సెక్రెటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు సభ్యసమాజం సహించని తీరుగా ఉందని మండిపడ్డారు. పుట్టిన గడ్డకు నమస్కరించని మూర్ఖుడు రేవంత్‌రెడ్డి అని, ఆయనకు పదవీ వ్యామోహం తప్ప.. ప్రజల కోసం పనిచేసే సోయి లేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఉద్యమంలో లేడని, తెలంగాణ ఆత్మలో అంతకంటే లేడని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్యకర్తకు కూడా రేవంత్‌రెడ్డి సరిపోడని ఎద్దేవాచేశారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లను తుడిపేయాలని కాంగ్రెస్ పార్టీ పగటి కలలు కంటున్నదని, తెలంగాణలో ఎక్కడచూసినా కేసీఆర్ ఆనవాళ్లు ఉన్నాయని గుర్తుచేశారు. అంబేద్కర్ విగ్రహంపై పువ్వు పెట్టే అవకాశం కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు.

పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు

ఖైరతాబాద్: కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు ఖండించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దాసోజు శ్రవణ్ కుమార్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సోమాజిగూడలో జరిగిన రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం ఉన్నతాధికారులు, విద్యార్థుల సమక్షంలో కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని చెప్పారు. పడేండ్ల పాటు గౌరవప్రదంగా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కేసీఆర్ గౌరవాన్ని దెబ్బతీసేలా, అభ్యంతరకరంగా, హింసాత్మక ధోరణిలో మాట్లాడారని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని, సీఎం రేవంత్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వరంగల్ ఏసీపీకి షోకాజ్ నోటీసులు

మంత్రి సురేఖ బర్త్‌డే వేడుకల్లో పాల్గొని చోద్యం చూసినందుకే..

సుబేదారి, ఆగస్టు 20 : మంత్రి కొండా సురేఖ బర్త్ డే వేడుకల్లో పాల్గొని ప్రజలకు ఇబ్బందులకు గురిచేసిన ఏసీపీ నందిరాంనాయక్‌కు మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ అయ్యింది. ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది సమక్షంలోనే మంత్రి అనుచరులు రాఖీ పండుగ రోజు రద్దీగా ఉన్న వరంగల్ కాశీబుగ్గ జంక్షన్ ప్రధాన రోడ్డును బ్లాక్ చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా రోడ్డుపై పటాకులు కాల్చడంతో నలుగురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకువచ్చింది. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, ఏసీపీ నందిరాం నాయక్‌కు మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. 5రోజుల్లో జవాబు చెప్పాలని అందులో పేర్కొన్నట్టు తెలిసింది. ఈ విషయమై సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమాను సీపీ విచారణకు ఆదేశించారు.

రేవంత్ నోట బజారు భాష

- స్కూల్ పిల్లల ముందు బూతు పురాణం
- సీఎం స్థాయి మరచి... చిల్లర మాటలు
- వ్యక్తులను కించపరిచేలా నీచపు మాటలు
- సీఎం తీరుపై మేధావుల మండిపాటు

హైదరాబాద్, ఆగస్టు 20(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డికి ఎక్కడ, ఎవరి ముందు ఏం మాట్లాడాలనే సోయి కూడా ఉండడం లేదు. స్కూల్ పిల్లల ముందు బజారు భాష మాట్లాడుతున్నారు. తాను సీఎంననే ఇంగితం మరచి రోత మాటలు మాట్లాడుతున్నారు. అది కూడా పలకలేని, పత్రికలో రాయలేని భాషను మాట్లాడుతుండడం గమనార్హం. మంగళవారం సోమాజీగూడ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి.. వందలమంది స్కూలు పిల్లల ముందు మాట్లాడుతూ బూతు పురాణం అందుకున్నారు. తాగుబోతులు, సన్నాసులు, వాడు, వీడు, అయ్య.. అంటూ నోటికొచ్చినట్టు మాట్లాడారు. పిల్లల ఎదుట సీఎం ఇలా మాట్లాడడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

ఏ కార్యక్రమం.. ఏం మాట్లాడారు?

మంగళవారం జరిగింది మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి. అక్కడ మాట్లాడాల్సింది ఆయన గురించి.. దేశానికి ఆయన అందించిన సేవల గురించి. కార్యక్రమానికి హాజరైన బడిపిల్లలకు రాజీవ్ గొప్పతనం గురించి చెబుతూ వారిలో స్ఫూర్తి రగిలించాల్సిన సీఎం సమయం సందర్భం లేకుండా మాట్లాడారు. ప్రాణాలు పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ ప్రజల దశాబ్దాల కల నెరవేర్చిన కేసీఆర్ లక్ష్యంగా చేసుకున్నారు. పదేండ్లపాటు రాష్ట్రాన్ని పాలించి అభివృద్ధిలో పరుగులు పెట్టించిన నేత చావు కోరేలా మాట్లాడారు. సచివాలయం ఎదుట కేసీఆర్ విగ్రహం పెడదామనుకున్నారంటూ.. రాయలేని, చెప్పలేని భాషలో మాట్లాడారు. సెక్రటేరియట్ వద్ద ఆయన విగ్రహం పెట్టి సమాజానికి ఏం సందేశమివ్వాలనుకుంటున్నారని కూడా సీఎం ప్రశ్నించారు.

అసలు కేటీఆర్ ఏమన్నారు?

సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాల్సిన ప్రతిపాదిత ప్రదేశంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఆ పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. తెలంగాణకు ఏమాత్రం సంబంధం లేని ఆయన విగ్రహాన్ని ఎలా పెడతారని, తాము అధికారంలోకి వచ్చాక ఆ విగ్రహాన్ని తొలగించడంతోపాటు శంషాబాద్ విమానాశ్రయానికి ఉన్న రాజీవ్ పేరును కూడా తొలగిస్తామని హెచ్చరించారు. అంతేకాదు, రాజీవ్, ఇందిర పేర్లతో ఉన్న ఇతర పథకాల పేర్లను కూడా మారుస్తామని చెప్పారు. నిజానికి సచివాలయం ఎదురుగా అంబేద్కర్, అమరవీరుల స్థూపం ఒక క్రమ పద్ధతిలో ఉన్నాయి. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెడితే తెలంగాణ పోరాటానికి అర్థవంతంగా ఉంటుందనేది కేటీఆర్ భావన. తెలంగాణతో ఏమాత్రం సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు సబబు కాదన్నది కేటీఆర్ వాదన. అక్కడ రాజీవ్ విగ్రహం ఏర్పాటు చేసి ఆయన జయంతి నాడు రాహుల్‌గాంధీని పిలిచి ఆవిష్కరించి అధిష్ఠానం వద్ద మార్కులు కొట్టేయాలని, తద్వారా పడిపోతున్న గ్రాఫ్‌ను నిలబెట్టుకోవాలని రేవంత్ భావించారు. తెలంగాణ సమాజం నుంచి దీనిపై వ్యతిరేకత వ్యక్తం కావడంతో ప్రస్తుతానికి అలాంటి పనిలేకుండానే, రాహుల్‌ను పిలవకుండానే రాజీవ్ జయంతిని నిర్వహించాల్సి వచ్చింది. ఇది రేవంత్‌లో ఫ్రస్ట్రేషన్‌కు కారణమైంది. అదే మరింత పెరిగి నోటి వెంట బూతులు రావడానికి కారణమైందని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, నిరసనలతో వెనక్కి తగ్గిన సీఎం ఆ తర్వాత సచివాలయంలో సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. అందుకు తగిన స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

సభ ఏదైనా.. బూతు పురాణమే

సీఎం రేవంత్‌రెడ్డి బూతులు మాట్లాడడం ఇదే తొలిసారి కాదు. సీఎం కాకముందు కూడా ఆయన మాటలు ఇలానే ఉండేవి. రాజకీయ సభ అయినా, ప్రభుత్వ సభ అయినా, అక్కడ మహిళలు ఉన్నా, పిల్లలు ఉన్నా ఆయన భాష మాత్రం మారడం లేదు. రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనంతోనే ఇలాంటి భాషను వాడుతున్నట్టు రాజకీయ, మేధావి వర్గాల్లో చర్చ జరుగుతున్నది. పార్టీలో లుకలుకలు, ప్రభుత్వంలో పూర్తిగా పట్టు సాధించలేకపోవడం వల్లే ఆయన ఇలా వ్యవహరిస్తున్నట్టు చెప్తున్నారు. మేధావులు సైతం సీఎం తీరుపై మండిపడుతున్నారు. గౌరవప్రదమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వ్యాఖ్యలపై సోషల్ మీడియాలోనూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన మాట్లాడిన వీడియోను షేర్ చేస్తూ ట్రోల్ చేస్తున్నారు. రేవంత్ తాను ముఖ్యమంత్రినన్న విషయాన్ని గుర్తించుకుని మాట్లాడాలని హితవు పలుకుతున్నారు.

హైదరాబాద్‌లో అంజన్‌కుమార్ నేతృత్వంలో జరిగిన యాదవ నేతల సమావేశం

కాంగ్రెస్‌లో గొల్లకురుమల రణభేరి

- ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం లేదంటూ ఆగ్రహం
- అంజన్‌కుమార్‌యాదవ్ నేతృత్వంలో ప్రత్యేక భేటీ
- తమ వల్లే కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిందని ఉద్ఘాటన
- పీసీసీ చీఫ్, మంత్రివర్గంలో స్థానం ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంపై అధికార పార్టీకి చెందిన గొల్లకురుమ నాయకులు తిరుగుబాటు జెండా ఎగరేశారా? తమకు పదవులు దక్కకపోవడంపై ఆగ్రహంతో రగిలిపోతున్నారా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన గొల్లకురుమ వర్గాలకు చెందిన పలువురు కీలక నేతలు మాజీ ఎంపీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ నేతృత్వంలో మంగళవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో పలువురు నేతలు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వంలో గొల్ల కురుమలకు ప్రాధాన్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన గొల్ల కురుమలకు ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. రాజకీయంగా బీసీలకు రావాల్సిన వాటా రావడం లేదని, ఈ సమయంలో బీసీలంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వంలో గొల్ల కురుమలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. తమ కులం వారికి టీపీసీసీ అధ్యక్ష పదవితో పాటు మంత్రివర్గ విస్తరణలో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు 6 కార్పొరేషన్ చైర్మన్ పదవులు, 5 కమిషన్ మెంబర్లు ఇవ్వాలని కోరారు. ఇంకా రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో తోట కూర జంగయ్య యాదవ్, చరణ్‌కౌశిక్ యాదవ్, గౌరీసతీశ్, లోకేశ్ యాదవ్, రాజేశ్, గడ్డం శేఖర్ యాదవ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, సోధని భూమన్న యాదవ్, కల్పన, మధుకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డీ..నోరు అదుపులో పెట్టుకో!

బీఆర్ఎస్ నేత తుంగబాలు

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని బీఆర్ఎస్ నేత తుంగబాలు సూచించారు. సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి హుందాగా వ్యవహరించాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తన సామర్థ్యం తెలుసుకోలేనివాడు తనని నాయకుడిగా భావించే వారందరినీ నాశనం చేస్తాడని, రేవంత్‌రెడ్డి తీరు కూడా అలాగే ఉందని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుకు కారణమైన అంబేద్కర్ పేరును కొత్త సచివాలయానికి పెట్టిన చరిత్ర కేసీఆర్‌ది అని, దేశానికి భారతమాత ఎలాగో రాష్ట్రానికి తెలంగాణతల్లి అలాగని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం కాకుండా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయానికి ఎదురుగా పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి అహంకారమే ఆయన పతనానికి కారణమని పేర్కొన్నారు.

సచివాలయ విగ్రహంపై బీజేపీ వైఖరేమిటి?

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ ముందు కేసీఆర్ ప్రతిపాదించిన తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలా? రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన రాజీవ్‌గాంధీ విగ్రహం ఉండాలా? అనే దానిపై కేంద్రమంత్రులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ తీరు చూస్తుంటే రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నదనే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. తెలంగాణను, తెలంగాణతల్లిని అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు.

సచివాలయంలో తెలంగాణ తల్లి

మొదటిపేజీ తరువాయి...

విగ్రహం ఉన్నచోట తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు అదే అసలైన ప్రతీక అవుతుందని గతంలో కేసీఆర్ సర్కార్ నిర్ణయం తీసుకున్నది. అయితే ఆ ప్రతిపాదిత స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ ఆక్షేపించింది. తెలంగాణ తల్లి విగ్రహం మినహా మరేది అక్కడ ఏర్పాటు చేసినా ఊరుకునేది లేదని హెచ్చరించింది. తెలంగాణ మేధో సమాజం కూడా సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ప్రతీకలో ప్రధానమైన తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు విషయంలో రేవంత్‌రెడ్డి ప్రజాభీష్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మేధావులు, కవులు, కళాకారులు, పాత్రికేయులు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. ప్రధానప్రతిక్షమే కాకుండా రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా బీఆర్ఎస్ పార్టీ నుంచి వస్తున్న వ్యతిరేకత, మరోవైపు తెలంగాణ బుద్ధిజీవుల నుంచి వస్తున్న విమర్శల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మంగళవారం రేవంత్‌రెడ్డి నష్టనివారణ చర్యకు శ్రీకారం చుట్టారు. ఇప్పటిదాకా 'జై తెలంగాణ' అనని, తెలంగాణ తల్లిని తలవని రేవంత్‌రెడ్డికి తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు ఆగమేఘాలపై ఒకటికి రెండుసార్లు సచివాలయంలో స్థల పరిశీలన చేశారు.

అట్టిమేటం జారీ చేసిన 24 గంటల్లోనే

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వానికి బీఆర్ఎస్ అట్టిమేటం జారీచేసిన 24 గంటల్లోనే రేవంత్ సర్కారు దిగొచ్చింది. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయ ప్రాంగణాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి వేర్వేరుగా రెండుసార్లు స్థల పరిశీలన చేశారు. రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తొలిరోజుల్లోనే జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ విభాగం మాజీ ప్రొఫెసర్ నేతృత్వంలో కమిటీ వేశారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా విగ్రహ ఏర్పాటు ఊసేలేదు. ఇపుడు బీఆర్ఎస్ హెచ్చరికల నేపథ్యంలో సర్కారులో చలనం వచ్చింది.

పెద్దపల్లిలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కులగణనా.. సీఎం కుర్చీ ఖాళీనా?

- ఇదే నినాదంతో బీసీ ఉద్యమం
- రేపు అఖిలపక్ష భేటీ, 26న కలెక్టరేట్ల ముట్టడి
- వచ్చే నెల 9న కులగణన మార్చ్
- కామారెడ్డి డిక్లరేషన్‌ను నెరవేర్చాల్సిందే..
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల డిమాండ్

పెద్దపల్లి, ఆగస్టు 20: కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని నిలబెట్టుకొని, వెంటనే సమగ్ర కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్‌లో బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అధ్యక్షతన బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. 'సమగ్ర కుల గణన చేపట్టాలి లేదా సీఎం రేవంత్‌రెడ్డి కుర్చీ ఖాళీ చేయాలి' అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 'స్వాతంత్ర్యం వచ్చి 78 ఏండ్లయినా రాష్ట్రంలో బీసీ బిడ్డ ముఖ్యమంత్రి అయిండా? అని ప్రశ్నించారు. ఓట్లు బీసీలవి, సీట్లు అగ్రవర్ణాలవా?, ఎందుకీ వివక్ష?, బీసీలకు రాజ్యాధికారం వద్దా?, ఇంకెన్నాళ్లీ కష్టాలు, కన్నీళ్లు, బానిస బతుకులు, ఇకనైనా తెగబడుదాం.. కలబడుదాం.. నిలబడుదాం, ఐక్యతతో పోరాటాలు చేస్తూ రాజ్యాధికారం చేపట్టే దిశగా అడుగులు వేద్దామని' పిలుపునిచ్చారు. అధికారంలో వచ్చిన ఆరు నెలల్లో సమగ్ర కులగణన చేపడుతామని నమ్మించి, బీసీ ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం, తొమ్మిది నెలలైనా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయడం లేదని విమర్శించారు. భావితరాల కోసమైనా సమగ్ర కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో అఖిలపక్ష సమావేశం, 26న కలెక్టరేట్ల ముట్టడి, వచ్చే నెల 9న కుల గణన మార్చ్ నిర్వహిస్తామని వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేయొచ్చు

హైకోర్టుకు నివేదించిన కేంద్రహోం శాఖ

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఫోన్ల ట్యాపింగ్ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఉన్నదని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ హైకోర్టుకు నివేదించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ చేసేందుకు తమ అనుమతి అవసరంలేదని తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్లలో కేంద్ర ప్రభుత్వ ప్రస్తావన లేదని గుర్తుచేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర ప్రభుత్వ ప్రస్తావన లేదని, కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వలేదని పేర్కొంది. గత పాలనలో రాజకీయ ప్రత్యర్థులు, ప్రైవేటు వ్యక్తులతో పాటు హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టుగా పత్రికల్లో వచ్చిన వార్తలను సుమోటోగా పరిగణించి హైకోర్టు విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ టీ వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారించింది. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ వాదనలు వినిపించారు. 'కేంద్ర టెలికమ్యూనికేషన్ చట్టం-23 జూన్ 2021 నుంచి అమల్లోకి వచ్చింది. దీనికి సంబంధించిన నిబంధనల రూపకల్పన జరగలేదు. కాబట్టి ప్రస్తుతం టెలిగ్రాఫ్ నిబంధనలే అమల్లో ఉన్నాయి. కొత్త చట్టం ప్రకారం అనుమతి లేకుండా చట్టవిరుద్ధంగా ట్యాపింగ్‌కు పాల్పడితే మూడేండ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.2 కోట్ల జరిమానా లేదా రెండూ కలిపి విధించవచ్చు. ఏ పరిస్థితుల్లో ఫోన్ ట్యాపింగ్ చేయవచ్చో టెలిగ్రాఫిక్ చట్ట నిబంధనల్లో ఉంది. దీని ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హోంశాఖ కార్యదర్శులు ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు జారీచేయవచ్చు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక అధికారాలు ఉన్నాయి. ట్యాపింగ్ ఎందుకు చేయాల్సి వస్తున్నదో కారణాలు రికార్డుల్లో నమోదు చేయాలి. ఈ ఉత్తర్వులను సమీక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేర్వ